క్లుప్తంగా

కనుల పండువగా వేంకటేశ్వరుని కల్యాణం

గుంటూరు రూరల్: అమరావతి రోడ్డు గోరంట్ల గ్రామంలో ఉన్న వేంకటేశ్వరస్వామి ఆలయంలో ఉత్తర నక్షత్రం సందర్భంగా స్వామివారి కల్యాణ మహోత్సవం శనివారం కనుల పండువగా నిర్వహించారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన కల్యాణ మహోత్సవంలో భక్తులు వందలాదిగా పాల్గొన్నారు. స్వామికి పూజలు, అభిషేకాలు, హోమాలు నిర్వహించారు. ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

పచ్చిరొట్ట సాగుపై అవగాహన కల్పించాలి



కాకుమాను: ఖరీఫ్ సీజన్ ప్రారంభం కానున్న నేపథ్యంలో రైతులకు వ్యవసాయ శాఖ సిబ్బంది పచ్చిరొట్ట విత్తనాలపై అవగాహన కల్పించాలని పొన్నూరు ఏడీఏ వి.రామ కోటేశ్వరి ఆదేశించారు. స్థానిక రైతు భరోసా కేంద్రంలో శనివారం వ్యవసాయ సిబ్బందితో ఆమె సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏడీఏ మాట్లాడుతూ ఖరీఫ్ సాగు చేసే రైతులు తమ పంట పొలాల్లో పచ్చిరొట్ట విత్తనాలను వేసే విధంగా అవగాహన కల్పించాలని సూచించారు. గ్రామాల వారీగా ప్రణాళిక సిద్ధం చేసి.. ఏ గ్రామంలో ఎంత విస్తీర్ణంలో మాగాణి సాగు చేస్తున్నారు. విత్తనాలు ఎన్ని టన్నులు అవసరమవుతాయో నమోదు చేయాలని ఏడీఏ ఆదేశించారు. ఈ సమావేశంలో ఏఓ కె.కిరణ్మయి, సిబ్బంది పాల్గొన్నారు.

అలరించిన నృసింహ గాన వైభవం



నగరంపాలెం: స్థానిక బృందావన్‌గార్డెన్స్ వేంకటేశ్వరస్వామి దేవాలయం అన్నమయ్య కళావేదికపై శనివారం చింతలపాటి రమామహేశ్వరి బృందంతో నృసింహ గానవైభవం జరిగింది. బెల్లంకొండ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో జరగ్గా, ఆలయ కమిటీ అధ్యక్షుడు సీహెచ్ మస్తానయ్య, సహాయ కార్యదర్శి ఊటుకూరి నాగేశ్వరరావు జ్యోతిప్రజ్వలనతో కార్యక్రమం ప్రారంభించారు. గాయనీమణులు చింతలపాటి రమామహేశ్వరి, ఇమ్మడి అంజనీదేవి, పావని, నాగలక్ష్మి బృందం హంసధ్వని రాగంలో తిరుమల గిరిరాయ, గంభీరనట రాగంలో శరణు శరణు, కళ్యాణి రాగంలో నవనారసింహ, సావేరి రాగంలో జయము జయము అంటూ పలు నృసింహ కీర్తనలను ఆలపించారు. ప్రేక్షకులను ఆకట్టుకున్నాయి. వయోలిన్‌పై పాలపర్తి ఆంజనేయులు, తబలాపై బాలాజీ వాద్య సహకారం అందించారు.

రైల్వే ట్రాక్‌పై గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం



లక్ష్మీపురం: గుంటూరు రైల్వే డివిజన్ పరిధిలోని మంగళగిరి డోలాస్‌నగర్ రైలు పట్టాలపై రైలు ఢీకొని గుర్తుతెలియని వ్యకి (25) అక్కడిక్కడే మృతి చెందిన సంఘటన శనివారం చోటు చేసుకుంది. రైల్వే జీఆర్పీ ఎస్ఐ రమేష్‌బాబు తెలిపిన వివరాల ప్రకారం గుర్తుతెలియని వ్యక్తి రైలు పట్టాలు దాటుతున్న సమయంలో రైలు ఢీకొనడంతో అక్కడిక్కడే మృతిచెందాడు. మృతదేహాన్ని ప్రభుత్వ ఆసుపత్రికి పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. వివరాలు తెలిసిన వారు జీఆర్పీ ఎస్ఐ రమేష్‌బాబు 9908383300 నంబరుకు సమాచారం తెలియజేయాలని కోరారు.

త్యాగరాజస్వామి జయంతి మహోత్సవం

నగరంపాలెం: స్థానిక లక్ష్మీపురంలోని శ్రీ త్యాగరాజస్వామి కళావేదికపై గాయత్రీ మహిళా సంగీత సన్మండలి ఆధ్వర్యంలో శనివారం సాయంత్రం సంగీత సద్గురు త్యాగబ్రహ్మ 257వ జయంతి మహోత్సవాన్ని భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. తొలుత టి.ఆదిత్యవాణి, టుబాకో బోర్డు ఈడీ డాక్టర్ అద్దంకి శ్రీధర్‌బాబు జ్యోతి ప్రజ్వలనతో ప్రారంభించారు. ముఖ్య అతిథి శ్రీధర్‌బాబు మాట్లాడుతూ చిరస్మరణీయుడైన త్యాగరాజ స్వామి జయంతి నిర్వహించటం విశేషమని అన్నారు. ఎంతో మంది యువ కళాకారులను ప్రోత్సహిస్తున్న గాయత్రీ మహిళా మండలి కృషి అభినందనీయమని పేర్కొన్నారు. అనంతరం శ్రీత్యాగరాజ విరచిత పంచరత్న కృతుల గోష్ఠి గానం చేపట్టారు. ప్రధాన కచేరీలో విద్వాన్ ధూళిపాళ సాయిదీక్షిత్ (మల్లాది సూరిబాబు మనువడు)చే శాస్త్రీయ సంగీత కచేరీ జరగ్గా, త్యాగరాజ కృతులను అత్యద్భుతంగా గానం చేశారు. వీరికి వయోలిన్‌పై విదుషి గాయత్రీ విభావరి (చెన్నై), మృదంగంపై విద్వాన్ కుందుర్తి అరవింద్ (చెన్నై) చక్కటి వాయిద్య సహకారాన్ని అందించారు. సన్మండలి అధ్యక్ష, కార్యదర్శులు డాక్టర్ పి.విజయ, ఎంవై శేషురాణి, ఉపాధ్యక్షులు డాక్టర్ రాజరాజేశ్వరి, ఎం.మీనాక్షి, పి.లలితదేవి, కార్యదర్శి మంగాదేవి, కోశాధికారి ఎం.విజయలక్ష్మి, ఉప కార్యదర్శి ఎం.మాధవీకృష్ణ పాల్గొన్నారు.

పేదల కోసం.. పెద్దాసుపత్రి

- రూ.6కోట్లతో ప్రత్తిపాడు సామాజిక ఆరోగ్య కేంద్రం ఆధునికీకరణ
- 90 శాతానికి పైగా పూర్తయిన నిర్మాణ పనులు
- త్వరలో పూర్తిస్థాయిలో రోగులకు అందుబాటులోనికి
- 95 గ్రామాల ప్రజలకు చెంతనే మెరుగైన వైద్య సేవలు !



ఆధునీకరించిన ప్రత్తిపాడు సామాజిక ఆరోగ్య కేంద్రం

ప్రత్తిపాడు: ప్రత్తిపాడులోని సామాజిక ఆరోగ్య కేంద్రం. నియోజకవర్గ పరిధిలోని పీహెచ్‌సీలకు వచ్చే అత్యవసర కేసులకు ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన చికిత్స నిమిత్తం మొదటిగా రిఫర్ చేయాల్సిన ఆసుపత్రి ఇది. ఇంతటి ప్రాధాన్యం కలిగిన ఆస్పత్రి అభివృద్ధిని గత చంద్రబాబు ప్రభుత్వం పూర్తిగా విస్మరించింది. టీడీపీ హయాంలో స్పెషలిస్టులు లేక.. విరిగిన తలుపులు, తుప్పుపట్టిన కిటికీలతో కనీస వసతులు కరువై.. నీరసించిన ఈ ఆస్పత్రికి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సర్కారు జీవం పోసింది. ఇప్పటికే స్పెషలిస్టు వైద్యుల పోస్టులన్నింటినీ భర్తీ చేసిన ప్రభుత్వం.. నాడు–నేడు కింద రూ.6 కోట్ల నాబార్డు నిధులతో ఆస్పత్రిని సర్వాంగ సుందరంగా ఆధునీకరిస్తోంది. దాదాపుగా నిర్మాణ పనులు పూర్తయిన ఈ ఆస్పత్రి భవనానికి తుది మెరుగులు దిద్దుతున్నారు. అతి త్వరలోనే అత్యాధునిక సౌకర్యాలు, స్పెషలిస్టుల సేవలతో ఈ ముప్పై పడకల ఆస్పత్రి పేద ప్రజలకు అందుబాటులోనికి రానుంది.

త్వరలో అందుబాటులోనికి..

ఆస్పత్రి నిర్మాణ పనులు దాదాపుగా 90 శాతానికి పైగా పూర్తయ్యాయి. మరో నెలా రెండు నెలల్లో పూర్తి కానుంది. చిన్న చిన్న పనులు మినహా మేజర్ పనులన్నింటినీ ఇప్పటికే గుత్తేదారులు పూర్తి చేశారు. సాధ్యమైనంత త్వరగా భవనాన్ని వైద్యాధికారులకు అప్పగించనున్నారు. రాష్ట్ర ఉన్నతాధికారులు ఇక్కడే మార్చురీ కూడా ఏర్పాటు చేయాలనే యోచలో ఉన్నట్లు తెలుస్తోంది. అదే జరిగితే మరో ప్రధాన సమస్య కూడా తీరే అవకాశం ఉంటుంది.

ప్రత్యేక వార్డులు..

గతంలో ఆస్పత్రి భవనం రెండు భవనాల్లో విడివిడిగా ఉండేది. ఇంజినీరింగ్ అధికారులు ఆయా భవనాలపై గ్రౌండ్ ఫ్లోర్, ఫస్ట్ ఫ్లోర్‌లను నిర్మించారు. ఈ భవనంలో అనేక వార్డులు అందుబాటులోనికి రానున్నాయి.

- మహిళల వార్డు
- క్యాజువాలిటీ బ్లాక్
- జనరల్ వార్డు
- చిన్న పిల్లల వార్డులు
- ఐసోలేషన్ రూం
- ఎక్స్‌రే రూం
- ల్యాబొరేటరీ
- బ్లడ్ బ్యాంక్
- ఫార్మసీ
- ఎగ్జామినేషన్ రూం
- లేబర్ డెలివరీ రికవరీ రూం

అత్యాధునికి వైద్య సేవలు..

ఆస్పత్రి నిర్మాణం పూర్తయిన తర్వాత పూర్తిస్థాయిలో అనేక విభాగాల వైద్య సేవలు కూడా ప్రజలకు అందుబాటులోనికి రానున్నాయి. ఆయా విభాగాల స్పెషలిస్టులు ప్రజలకు రౌండ్ ది క్లాక్ సేవలు అందించనున్నారు.

- జనరల్ మెడిసిన్
- స్త్రీ ప్రసూతి వైద్య విభాగం
- చిన్నపిల్లల వైద్య విభాగం
- మత్తు వైద్య విభాగం
- ఆప్తమాలజీ వైద్య విభాగం
- ఆయుష్ వైద్యులు
- సిజేరియన్లు
- ఈఎన్‌టీ విభాగం

భక్తిశ్రద్ధలతో చౌడేశ్వరి అమ్మవారి ఉత్సవాలు



చౌడేశ్వరి అమ్మవారు

పెదకాకాని: శ్రీ చౌడేశ్వరిదేవి అమ్మవారి జ్యోతుల మహోత్సవాలు శనివారం భక్తిశ్రద్ధలతో ప్రారంభమయ్యాయి. మండలంలోని తక్కెళ్ళపాడు గ్రామంలో వేంచేసియున్న చౌడేశ్వరి దేవి అమ్మవారి ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఏటా జ్యోతులతో గ్రామోత్సవం నిర్వహిస్తారు. ఈ ఏడాది 16 జ్యోతులతో శనివారం రాత్రి 12 గంటల నుంచి ఆదివారం ఉదయం 10 గంటల వరకూ గ్రామోత్సవం జరుగుతుంది. గ్రామానికి చెందిన ఆడపడుచులు స్వగ్రామానికి చేరుకున్నారు. గ్రామంలో పండుగ వాతావరణం చోటు చేసుకుంది. రాత్రి 7 గంటలకు పొంగలి నైవేద్యాలు సమర్పించారు. మంగళ వాయిద్యాలతో తొగట వీరులు కత్తులు, నారజములు, పసుపు కొమ్ములతో జలధి దగ్గరకు వెళ్లి బండారు కొట్టుట జరిగింది. రాత్రి 10 గంటలకు జ్యోతుల తయారు చేసి మేళ తాళాలు, భజనలు, తీన్‌మార్ తప్పెట్ల నడుమ గ్రామోత్సవం కనుల పండువగా జరిగింది. అమ్మవారి మొక్కులు చెల్లించేందుకు 30 వేల పాటేళ్లు సిద్ధం చేశారు. ఆదివారం పూజా కార్యక్రమాల అనంతరం భక్తులందరికీ అన్న సంతర్పణ జరుగుతుందని నిర్వాహకులు తెలియజేశారు.

అట్లుంటది.. మన ఆర్టీసీ డిపో పార్కింగ్



పార్కింగ్ ప్రదేశంలో వర్షపు నీటిలో ఉన్న వాహనాలు

- నిలువ నీడలేని పొన్నూరు బస్ డిపో పార్కింగ్ స్థలం
- వానకు మునిగిపోతున్న ద్విచక్ర వాహనాలు

పొన్నూరు: పొన్నూరు ఆర్టీసీ డిపో అభివృద్ధి బాట పడుతున్నా.. ప్రయాణికులకు సరైన సౌకర్యాలు కల్పించడంలో వెనుకబడి ఉంది. బస్ డిపోలోని పార్కింగ్ స్థలానికి ఆదరణ లేకపోవడంతో వాహనదారులు అవస్థలు పడుతున్నారు. నిత్యం పొన్నూరు చెందిన 38 బస్సులతో పాటు బాపట్ల, చీరాల, రేపల్లె ప్రాంతాల బస్సులు ఈ డిపో నుంచి రాకపోకలు సాగిస్తూ ప్రయాణికులను గమ్యస్థానాలకు చేరుస్తున్నాయి. అయితే డిపోలో పార్కింగ్ ప్రదేశం అభివృద్ధి లేక వాహనదారులకు అసౌకర్యంగా మారింది. దూర ప్రాంతాలకు వెళ్లే ప్రయాణికులు తమ ద్విచక్ర వాహనాలను డిపోలోని పార్కింగ్ స్థలంలో నిలిపి వెళ్తున్నారు. నిర్ణయించిన రుసుము చెల్లిస్తున్నా వాహనాల భద్రత చేపట్టడంలో ఆర్టీసీ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని వాహనదారులు ఆరోపిస్తున్నారు. మండుటెండల్లో కూడా వాహనాలు ఎండలోనే ఉండాల్సిన పరిస్థితి నెలకొంది. వర్షాలు కురిసే సమయంలో పార్కింగ్ స్థలం చెరువుగా మారి వాహనాలు మునిగిపోతున్నా అధికారులు పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఉన్నతాధికారులు స్పందించి పార్కింగ్ ప్రదేశాన్ని అభివృద్ధి చేయాలని ప్రయాణికులు కోరుతున్నారు.

చిప్స్ కళాశాలలో రాష్ట్ర స్థాయి వక్తృత్వ పోటీలు



విజేతలతో కళాశాల యాజమాన్యం

గుంటూరు రూరల్: విద్యార్థులకు విద్యతో పాటు అన్ని రంగాల్లో ప్రావీణ్యత ఎంతో అవసరమని చేబ్రోలు హనుమయ్య ఫార్మసీ కళాశాల(చిప్స్) ప్రిన్సిపల్ డాక్టర్ ఎస్.విద్యాధర్ పేర్కొన్నారు. శనివారం కళాశాలలో రాష్ట్ర స్థాయి వక్తృత్వ పోటీలు నిర్వహించారు. రాష్ట్రంలోని వివిధ కళాశాలలకు చెందిన విద్యార్థులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన సభలో ప్రిన్సిపల్ మాట్లాడారు. రాష్ట్ర స్థాయి విజేతలకు జాతీయ స్థాయి పోటీలు హైదరాబాదులోని ఇండియన్ ఫార్మాస్యూటికల్ ఎడ్యుకేషన్ డివిజన్, ఇండియన్ ఫార్మాస్యూటికల్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో జరుగుతాయని తెలిపారు. వారికి ఉచిత వసతి, ప్రయాణ సదుపాయాలు కల్పిస్తున్నట్లు చెప్పారు. ఐపీఏ నేషనల్ అధ్యక్షుడు డాక్టర్ టీవీ నారాయణ మాట్లాడుతూ ఆరోగ్య సెక్టార్‌లో ఫార్మా రంగం కీలక పాత్ర పోషిస్తుందన్నారు. కరోనా సమయంలో దేశంలోని ఫార్మా సంస్థలు కీలక పాత్ర పోషించి, రోగులకు అవసరమైన వ్యాక్సినల్‌ను సమయానికి ప్రపంచ స్థాయిలో అందించాయని తెలిపారు. విజేతలకు మొదటి బహుమతి రూ.5 వేలు, ద్వితీయం రూ.3 వేలు అందజేశారు. కార్యక్రమంలో కళాశాల అధ్యక్షుడు డాక్టర్ ఆర్.శ్రీనివాస్, సెక్రటరీ కరస్పాండెంట్ సీఎస్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

నేలలో సేంద్రియ పదార్థం తప్పనిసరి



గుంటూరు రూరల్: నేలలో సేంద్రియ పదార్థం పెంచి భూమి ఆరోగ్యాన్ని కాపాడటంతో పాటు ఆరోగ్యకరమైన పంటలను పండించవచ్చని వ్యవసాయ శాఖ రిటైర్డ్ డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ కె.రామచంద్రం తెలిపారు. శనివారం వట్టిచెరుకూరు మండలం పుల్లడిగుంటలోని రైతు నేస్తం ఫౌండేషన్‌లో సేంద్రియ వ్యవసాయంపై రైతు శిక్షణ తరగతులను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బొప్పాయి, అరటి పంటలు సేంద్రియ సాగుకు అనుకూలంగా ఉంటాయని సేంద్రియ రైతు మీసాల రామకృష్ణ వివరించారు. ఫౌండేషన్‌లో ఏర్పాటు చేసిన గోశాల, కట్టెగానుగతో నూనె తీసే ప్రక్రియ, వానపాముల ఎరువు, ఘన జీవామృతం తయారీ విధానం ప్రత్యక్షంగా రైతులకు చూపించారు. రైతు నేస్తం చైర్మన్ వై.వెంకటేశ్వరరావు ఉన్నారు.

బైక్ చోరీపై ఫిర్యాదు

తాడేపల్లిరూరల్: వడ్డేశ్వరం కేఎల్ యూనివర్సిటీ వద్ద బైక్ చోరీపై శనివారం తాడేపల్లి ఎస్ఐ సాయిప్రసాద్ కేసు నమోదు చేశారు. వివరాల మేరకు.. దుగ్గిరాలకు చెందిన పెయింటర్ సందీప్ ఈ నెల 9న కేఎల్ యూనివర్సిటీ గేటు ముందు తన ద్విచక్రవాహనం పార్క్ చేసి లోపలకు వెళ్లాడు. సాయంత్ర బయటకు వచ్చి చూడగా వాహనం కనిపించలేదు. ఆలస్యంగా ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

ప్రాంగణ ఎంపికల్లో జీవీఆర్ఎస్ విద్యార్థుల ప్రతిభ



ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులతో కళాశాల యాజమాన్యం

గుంటూరు రూరల్: ప్రతి విద్యార్థికి ఉజ్వల భవిష్యత్తుతోపాటు ఉపాధి లక్ష్యంగా తమ కళాశాల ఎల్లప్పుడూ కృషి చేస్తుందని జీవీఆర్ఎస్ ఇంజినీరింగ్ కళాశాల చైర్మన్ డాక్టర్ సిందూర తెలిపారు. శనివారం మండలంలోని బుడంపాడు గ్రామంలోని కళాశాలలో మెగా జాబ్ మేళా నిర్వహించారు. ఇందులో కళాశాలకు చెందిన 86 మంది విద్యార్థులు ఉద్యోగాలకు ఎంపికయ్యారని చైర్మన్ తెలిపారు. ఆయా సంస్థలైన డైకిన్, మోడైన్, గూగుల్, టీం లీజ్, టాగ్ కార్పొరేషన్ రూ.2.5 లక్షల నుంచి రూ.3.6 లక్షల వార్షిక వేతనంతో విద్యార్థులతో ఒప్పందం కుదుర్చుకున్నాయని తెలిపారు. ఈ సందర్భంగా ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులను కళాశాల డైరెక్టర్ డాక్టర్ కరిమున్నీసా, ప్రిన్సిపల్ డాక్టర్ కె.రమేష్ బాబు, డీన్ డాక్టర్ బి.వరప్రసాద్, టీపీఓ పి.రవికుమార్, ఎ.శివాచారి, హెచ్ఓడీలు వివిధ విభాగాల అధిపతులు అభినందించారు.

అకాల వర్షంతో రైతులకు పాట్లు



తడవకుండా కల్లాంలో పంటపై కప్పిన పట్ట

పెదకాకాని: అకాల వర్షం వదలకపోవడంతో రైతులకు ఇబ్బందులు తప్పడం లేదు. కల్లాల్లో ఆరుతున్న మిరపకాయలు, మొక్కజొన్నలు తడవకుండా పట్టలు కప్పి పంటను కాపాడుకుంటున్నారు. రెండు రోజులుగా వర్షపు జల్లులు పడుతున్నాయి. మండలంలోని వెనిగండ్ల, కొప్పురావూరు, తక్కెళ్ళపాడు, పెదకాకాని గ్రామాల్లో సాగులో ఉన్న మిరపకాయల చివరి దశ కోతలు సాగుతున్నాయి. వరుణుడు కరుణించాలని రైతులు కోరుకుంటున్నారు.

మతిస్థిమితం లేని మహిళ అప్పగింత



గుంటూరు రూరల్: మతిస్థిమితం సరిగా లేని మహిళను నల్లపాడు పోలీస్ స్టేషన్ పోలీసులు నగరంలోని మహిళా ప్రాంగణానికి శనివారం అప్పగించారు. సీఐ నరేష్‌కుమార్ వివరాల మేరకు.. సుమారు 30 సంవత్సరాల వయస్సు గల మహిళ నల్లపాడు గ్రామంలోని కళాశాల సెంటర్‌లో తిరుగుతూ ఉంది. స్థానికులు గమనించి పోలీసులకు సమాచారం అందించారు. ఆమె ఆచూకి తెలిసిన వారు నేరుగా నల్లపాడు పోలీస్ స్టేషన్‌లో లేదా 8688 831607 నంబర్‌కు సంప్రదించాలన్నారు.

ఓట్ల లెక్కింపుపై అప్రమత్తత అవసరం



అధికారులతో సమావేశమైన అదనపు కమిషనర్, పశ్చిమ ఆర్ఓ కె.రాజ్యలక్ష్మి

నెహ్రూనగర్: కౌంటింగ్ విధులకు ఎంపికైన అధికారులు, సిబ్బంది ఓట్ల లెక్కింపుపై అప్రమత్తంగా ఉండాలని నగరపాలక సంస్థ అదనపు కమిషనర్ గుంటూరు పశ్చిమ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి కె.రాజ్యలక్ష్మి సూచించారు. శనివారం నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయంలోని గుంటూరు వెస్ట్ రిటర్నింగ్ అధికారి కార్యాలయంలో జూన్ 4న జరగనున్న ఓట్ల లెక్కింపు ఏర్పాట్లు, ఉద్యోగులు నిర్వహించవలసిన విధులపై ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జూన్ 4న ఆచార్య నాగార్జున యూనివర్సిటీలో సార్వత్రిక ఎన్నికల ఓట్ల లెక్కింపు జరుగుతుందని, పోటీ చేసిన రాజకీయ పార్టీల, స్వతంత్ర అభ్యర్థులకు లెక్కింపు తేదీ, సమయం గూర్చిన వివరాలను నోటీసు ద్వారా సమాచారం అందించాలన్నారు. జిల్లాలోని ఇతర నియోజకవర్గాలతో పాటు గుంటూరు పశ్చిమ నియోజకవర్గ ఓట్ల లెక్కింపు జరిగే యూనివర్సిటీలో ఎన్నికల సంఘం మార్గదర్శకాల మేరకు పక్కాగా ఏర్పాట్లు చేయాలన్నారు. కౌంటింగ్ విధులు కేటాయించిన అధికారులకు, సిబ్బందికి గుర్తింపు కార్డులను అందజేయాలని, సెక్టార్, పోలింగ్ కేంద్రాల వారీగా టేబుల్స్ ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. స్ట్రాంగ్ రూమ్ నుంచి ఈవీఎంలు తీసుకొచ్చేందుకు, అధికారులు, లెక్కింపు సిబ్బంది, అభ్యర్థులు, ఏజెంట్లు లెక్కింపు కేంద్రంలోనికి వచ్చేందుకు వేరువేరుగా మార్గాలు ఉండాలని, అవసరమైతే బారికేడింగ్ చేపట్టాలని ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. సీసీ కెమెరాలను ఇప్పటికే స్ట్రాంగ్ రూమ్‌లో ఏర్పాటు చేయడం జరిగిందని, సదరు విజువల్స్‌ని యూనివర్సిటీ ప్రాంగణంలోని కంట్రోల్ రూమ్‌లో చూడవచ్చని అభ్యర్థులకు తెలియచేయాలన్నారు. కౌంటింగ్‌కు అవసరమైన మెటీరియల్ చెక్ లిస్ట్ సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. టేబుళ్ల వారీగా, రౌండ్ల వారీగా ఫలితాలను జిల్లా ఎన్నికల అధికారి, ఎన్నికల కమిషన్‌కు ఎప్పటికప్పుడు అందించేందుకు అవసరమైన కంప్యూటర్ ఆపరేటర్లు, కంప్యూటర్లు, డిజిటల్ స్క్రీన్ ముందస్తుగా సిద్ధం చేసుకోవాలన్నారు. ఈ సమావేశంలో ఈఈలు కొండారెడ్డి, కోటేశ్వరరావు, సూపరింటెండెంట్లు వెంకట రామయ్య, సాంబశివరావు, పద్మ, ఎన్నికల డిప్యూటీ తహసీల్దార్ భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

నిర్దేశిత లక్ష్యాల ప్రకారం వ్యాక్సినేషన్

టీబీ కంట్రోల్ ప్రోగ్రాం రాష్ట్ర జేడీ డాక్టర్ టి.రమేష్



మాట్లాడుతున్న డాక్టర్ రమేష్, పక్కన డాక్టర్ విజయలక్ష్మి

గుంటూరు మెడికల్: టీబీ రాకుండా పెద్దలకు ప్రభుత్వం ఉచితంగా వ్యాక్సిన్లు అందిస్తున్న దృష్ట్యా వైద్య సిబ్బంది నిర్దేశించిన లక్ష్యాల ప్రకారం అందరికీ వ్యాక్సిన్లు వేయించాలని క్షయ నియంత్రణ కార్యక్రమం రాష్ట్ర జాయింట్ డైరెక్టర్ డాక్టర్ టి.రమేష్ అన్నారు. జిల్లా వైద్య, ఆరోగ్య శాఖధికారి సమావేశ మందిరంలో వైద్యాధికారులు, స్పెషలిస్ట్ డాక్టర్‌లతో శనివారం డీఎంహెచ్ఓ డాక్టర్ కొర్రా విజయలక్ష్మి అధ్యక్షతన సమీక్ష జరిగింది. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన డాక్టర్ రమేష్ మాట్లాడుతూ అడల్ట్ బీసీజీ వ్యాక్సినేషన్‌లో గుంటూరు జిల్లా వెనుకబడటానికి గల కారణాలు అడిగి తెలుసుకున్నారు. వ్యాక్సిన్ చేయించుకున్న ప్రతి ఒక్కరిని 3 నెలలకు ఒకసారి 3 సంవత్సరాల పాటు ఫాలో అప్ చెయ్యాలన్నారు. వ్యాక్సిన్ వేయించుకున్న వారి వివరాలను ఆన్‌లైన్‌లో అప్లోడ్ చేయాలని చెప్పారు. జిల్లా వైద్య, ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ కొర్రా విజయలక్ష్మి మాట్లాడుతూ గర్భిణుల నమోదు తక్కువగా ఉన్న ఆరోగ్య కేంద్రాల వారు నిర్దేశించిన లక్ష్యాలను చేరుకోవాలన్నారు. ఆరోగ్య కేంద్రాల్లో కాన్పులు చేసి వాటిని ఆన్‌లైన్‌లో నమోదు చేయాలన్నారు. కాన్పుల కోసం 108 అంబులెన్సు వాహనాల సేవలను వినియోగించుకోవాలని చెప్పారు. ట్యూబెక్టమీ శిక్షణ పొందిన డాక్టర్స్ వెంటనే తాము పనిచేస్తున్న ఆరోగ్య కేంద్రాల్లో ఆపరేషన్లు ప్రారంభించాలన్నారు. ఎలాక్ట్రానిక్ హెల్త్ రికార్డులు ఆన్‌లైన్‌లో అప్‌లోడు చేయాలని, ఇందుకోసం ఆరోగ్యకేంద్రాల్లో పనిచేస్తున్న పురుష ఆరోగ్య కార్యకర్తల సేవలు ఉపయోగించుకోవాలన్నారు. జిల్లా టీబీ అధికారి డాక్టర్ దాసరి శ్రీనివాసులు, ఎన్‌సీడీ ప్రోగ్రామ్ జిల్లా అధికారి డాక్టర్ అమర్తలూరి శ్రావణ్ బాబు, డీఐఓ డాక్టర్ కె.వి.సుబ్బరాజు, ఎన్‌హెచ్‌ఎం డీపీఎంఓ డాక్టర్ చుక్కా రత్నమన్మోహన్, డెప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ ఇ.అన్నపూర్ణ, జిల్లా మలేరియా అధికారి సుబ్బరాయణం, తదితరులు పాల్గొన్నారు.

కుమార్తె అదృశ్యంపై ఫిర్యాదు

తాడేపల్లిరూరల్: తాడేపల్లి పట్టణ పరిధిలోని బ్రహ్మానందపురంలో నివాసముంటున్న ఓ వ్యక్తి తన కుమార్తె కనిపించడం లేదంటూ శనివారం తాడేపల్లి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఎస్ఐ సాయిప్రసాద్ వివరాల మేరకు.. తలపాల దాసు కుమార్తె కీర్తన బీటెక్ పూర్తిచేసి ఓ ప్రైవేటు ఇన్స్యూరెన్స్ కంపెనీలో ఉద్యోగం చేస్తోంది. కీర్తనను ఉద్యోగం చేయడానికి వీలులేదని, చేస్తున్న ఉద్యోగం తాలూకా జీతం కూడా తీసుకురావడం లేదని తల్లి మందలించడంతో కీర్తన శుక్రవారం ఉద్యోగానికి కని వెళ్లి ఇంటికి తిరిగి రాలేదు. సదరు ఇన్స్యూరెన్స్ కంపెనీ వద్ద, పలు ప్రాంతాల్లో విచారణ చేసినా ఎటువంటి సమాచారం లభించలేదు. దీంతో తమ కుమార్తె కనిపించడం లేదంటూ తండ్రి దాసు ఫిర్యాదు చేశాడన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ సాయిప్రసాద్ తెలిపారు.